సాక్షి
నిజామాబాద్
గురువారం ■ 14 ■ నవంబర్ ■ 2024



హాకీ విజేత జిల్లా జట్టు

నగరంలో మూడు రోజులుగా సాగుతున్న హాకీ టోర్నీ ముగిసింది. జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది.

- 8లో ▸



సమన్వయంతో మెరుగైన..

బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా జడ్జి సునీత తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /15.7

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి



నిజామాబాద్ అర్బన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు. డిచ్‌పల్లి, ఆర్మూర్, ఎడపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయనున్నారు.

లింబాద్రిగుట్టకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఆర్మూర్, నిజామాబాద్, ధర్పల్లి, సిరికొండ నుంచి లింబాద్రి గుట్టకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రూప్–3 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖలీల్‌వాడి: గ్రూప్– 3 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 66 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష కేంద్రాల ప్రాంతంలో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రం ప్రాంతంలో జిరాక్స్ సెంటర్లు, షాపులు తెరిచి ఉంచవద్దని చెప్పారు. జీజీ కాలేజీ నుంచి పరీక్ష మెటీరియల్ తీసుకువెళ్లే సమయంలో ఏఆర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

18లోగా సర్వే పూర్తి చేయాలి




కమ్మర్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లిలో మండలాధికారులు, సర్వే సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక రాజీవ్‌గాంధీ కాలనీలో సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో రాజాశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీఎం కుంట గంగాధర్ పాల్గొన్నారు.

పుణ్య స్నానాలకు వచ్చి..

- తల్లి కళ్ల ముందే నీట మునిగి కొడుకు మృతి

మోర్తాడ్: తన కళ్ల ముందే కొడుకు నీట మునిగి పోతుంటే ఆ తల్లి తల్లడిల్లింది. కుమారుడిని రక్షించమని కేకలు వేసింది. ఆమె మాటలు విని స్థానికులు రక్షించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఏర్గట్ల మండలం తడపాకల్ గోదావరి నదిలో నీట మునిగి బుధవారం ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. మాక్లూర్ మండలం మానిక్‌బండార్‌కు చెందిన ఉమ్మాయి గంగమణి ఇంటర్ చదువుతున్న తన కొడుకు రామ్‌చరణ్(16)ను వెంటబెట్టుకుని తడపాకల్‌కు చేరుకుంది. స్నానాలను ఆచరించడానికి రామ్‌చరణ్ నదిలోకి దిగాడు. వెంటనే అతను మునిగిపోతుండటంతో ఆ తల్లి కేకలు వేసింది. స్థానికులు నదిలోకి దూకి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే నదిలో మునిగిన అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్యం బందీ!



మైదానంలో ఆడుకోవాల్సిన పిల్లలు స్మార్ట్‌ఫోన్లలో బందీ అవుతున్నారు.. తోటి వారితో కలిసి ఆనందంగా గడపాల్సిన వయసులో ఫోన్లలో నిమగ్నం అవుతున్నారు. ఇంట్లో పెద్దవారు చెప్పే కథలు వినాల్సిన బాలలు యూట్యూబ్‌లో కథలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. స్మార్ట్ మాయలో సృజనాత్మకత కోల్పోతున్నారు. ఆలోచించే శక్తి సైతం కోల్పోతున్నారు.

- ప్రతి అసైన్‌మెంట్‌కు ఇంటర్‌నెట్‌ను ఆశ్రయిస్తున్న చిన్నారులు
- వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్న ప్రాథమిక స్థాయి విద్యార్థులు
- తగ్గుతున్న సృజనాత్మకత
- అంతంతమాత్రంగా సామాజిక అవగాహన
- నేడు బాలల దినోత్సవం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సాంకేతికత రోజురోజుకూ పెరుగుతోంది.. గూగుల్‌లో వెతికితే లభించని సమాచారం ఉండదు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైతం రాజ్యమేలే పరిస్థితి వచ్చింది. టెక్నాలజీతో చాలా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ నాణేనికి మరోవైపు అన్నట్లుగా టెక్నాలజీతో సమస్యలు సైతం అదేవిధంగా ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులపై టెక్నాలజీ ప్రభావం విపరీతంగా పడుతోంది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ప్రతి అంశానికీ సాంకేతికతపై ఆధారపడుతున్నారు. ఈ కారణంగా విద్యార్థులు సృజనాత్మకతను, ఆలోచనా పరిజ్ఞానాన్ని కోల్పోతున్నారు. పైగా నైతిక విలువలు, నైతిక ప్రవర్తన సైతం కోల్పోతున్నారు. తల్లిదండ్రులు, పెద్దలతో ఏవిధంగా వ్యవహరించాలి, ఎలా ప్రవర్తించాలనే విషయమై పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది.

తల్లిదండ్రుల ఒత్తిడి

తల్లిదండ్రులు సైతం ప్రస్తుత పోటీ యుగంలో కేవలం లక్ష్యాన్ని సాధించాలి తప్ప ఇతరత్రా సాధారణ విషయాలు, సామాజిక అంశాల గురించి ఆలోచించే, పరిశీలించే దిశగా ప్రోత్సహించడం లేదు. లక్ష్యం తప్ప ఇతర అంశాల గురించి ఆలోచన చేయవద్దంటూ చిన్నారులను ప్రాథమిక విద్య దశ నుంచే టీచర్లు, తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తుండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అనేక అంశాలను వివిధ కోణాల్లో విశ్లేషణ చేసుకునే సామర్థ్యాన్ని సైతం విద్యార్థులు కోల్పోతున్నారు. తోటి విద్యార్థులతో కలిసి చర్చించే పరిస్థితి సైతం లేకపోవడంతో పరిస్థితి తీసికట్టుగా మారుతోంది. దీంతో కళాశాల వయస్సుకు రాకముందే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తండ్రి సెల్‌ఫోన్ కొనివ్వలేదని, తల్లి వీడియో గేమ్ ఆడనివ్వలేదని ఆత్మహత్యలు చేసుకునే విద్యార్థుల సంఖ్య పెరిగిపోతోంది.

ఇంటర్‌నెట్‌పై ఆధారం

విద్యార్థులు తమ సబ్జెక్టులను మాత్రమే చదవాలని, ఇతర అంశాలను పట్టించుకోవద్దని టీచర్లు, తల్లిదండ్రులు సైతం చెబుతుండడం సైతం ఇబ్బందికరంగా మారింది. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అసైన్‌మెంట్ల కోసం విద్యార్థులు ఇంటర్‌నెట్ మీద ఆధారపడుతున్నారు.

దీంతో ఆలోచన, విశ్లేషణ సామర్థ్యం కోల్పోతున్నారు. ప్రస్తుతం ప్రాథమిక విద్య చదువుతున్న విద్యార్థులు సైతం తమ తల్లిదండ్రుల నంబర్లతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తిగా టెక్నాలజీ అనేవిధంగా తయారయ్యారు. దీంతో అనేక రుగ్మతలు తలెత్తుతున్నాయి. చిన్నారులను, విద్యార్థులను 'టెక్ చైల్డ్' మాదిరిగా కాకుండా సామాజిక బాధ్యత కలిగినవాళ్లుగా తయారు చేసేందుకు టీచర్లు, తల్లిదండ్రులు ఆలోచన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

“సామాజిక అంశాలు విద్యలో భాగమే..



చిన్నారులను ప్రాథమిక విద్య స్థాయి నుంచే క్షేత్రస్థాయిలో సామాజిక అంశాల గురించి తెలుసుకునేవిధంగా టీచర్లు, తల్లిదండ్రులు పక్కాగా వ్యవహరించాలి. ఇంటర్‌నెట్ లేకుండా దినపత్రికలు చదివేలా, మైదానాల్లో ఆడేలా ప్రోత్సహించాలి. ఇవి కాకుండా ఈవెంట్లు, ఫంక్షన్లకు సైతం తరచూ తీసుకెళ్లాలి. మన ప్రాంతాల గొప్పతనం గురించి వివరించాలి. వివిధ వర్గాల ప్రజల జీవనశైలి గురించి వివరించాలి. తాతయ్యలు, అమ్మమ్మలు, నానామ్మలతో గడిపేలా ప్రోత్సహించాలి. దీంతో అనేక నైతిక అంశాల గురించి తెలుసుకుంటారు. ఇవన్నీ విద్య కిందకే వస్తాయి. అదేవిధంగా తోటి వ్యక్తులతో పరస్పర సహకారం ఏ విధంగా చేసుకోవాలో చిన్నతనం నుంచే చెప్పాలి. దీంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ మానసిక ఒత్తిడి, శారీరక బాధ కలిగినప్పుడు ఆత్మహత్యల దిశగా ఆలోచనలు చేయకుండా ఉంటారు. మరోవైపు ప్రోజెన్ ఫుడ్, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ కాకుండా సాంప్రదాయ మిల్లెట్స్ లాంటి ఆహారాన్ని తినేలా అవగాహన కల్పించాలి. **– విశాల్ ఆకుల, సైకాలజీ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్య కళాశాల, నిజామాబాద్**

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



బాలోత్సవంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- పిల్లలకు ఆటలూ ముఖ్యమే..
- క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- బాలోత్సవం ముగింపు వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ/మోపాల్: విద్యార్థులను చదువులకే పరిమితం చేయకుండా వారిలోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం మోపాల్ శివారులోని ప్రెసిడెన్సీ పాఠశాలలో బాలోత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం ట్రస్ట్, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో 1500 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలు బోధిస్తూ వారి మెదళ్లపై మోయరాని భారం మోపుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమేనన్నారు. ప్రతి విద్యార్థికి ఒక్కో రంగంలో ఆసక్తి, నైపుణ్యం ఉంటుందన్నారు. వారి అభిరుచులను తెలుసుకుని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు కానుందన్నారు. జిల్లా నుంచి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. అనంతరం బాలోత్సవ్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, బాలోత్సవ్ నిర్వాహకులు నర్రా రామారావు, పాఠశాల ప్రిన్సిపల్ పవన్ కుమార్, డాక్టర్ జైనీ నెహ్రూ, రవీంద్రనాథ్ సూరి, కొహెడి నర్సింలు, నాయకులు సాయిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రిజిస్ట్రేషన్ల కోసం నేరుగా సంప్రదించాలి

సుభాష్‌నగర్: నగర ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ విషయంలో ఏమైనా సందేహాలుంటే కార్యాలయ సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పేరు మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దస్తావేజు రిజిస్ట్రేషన్ నిబంధనలకు లోబడే చేస్తున్నామని ప్రజలు గమనించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయాలని సబ్ రిజిస్ట్రార్‌పై కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఒత్తిడి తెస్తున్నారని, రిజిస్ట్రేషన్ చేయకుంటే ధర్నాలు చేయడం, అనవసరంగా అవినీతి ఆరోపణలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యాలయంలోకి డాక్యుమెంట్ రైటర్ల ప్రవేశం నిషేధమని, మున్ముందు దీనిని మరింత కట్టుదిట్టం చేస్తామని స్పష్టంచేశారు. నిజామాబాద్ అర్బన్ కార్యాలయంలో ఒక్క సబ్ రిజిస్ట్రార్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని, మరొకరు మూడు నెలలుగా సెలవులో ఉన్నారని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేయిస్తామని మధ్యవర్తులు ఎవరైనా చెప్తే.. నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కాగా బుధవారం ఆరు మార్ట్‌గేజ్, రిలీజ్ డీడీల డాక్యుమెంట్లు దళారుల ప్రమేయం లేకుండా చేసినట్లు శ్రీరామరాజు తెలిపారు.

మార్మోగనున్న అయ్యప్ప శరణుఘోష



కోటగిరిలో నిర్మించిన ఆలయం

- నేటి నుంచి 18 వరకు కోటగిరిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కోటగిరిలో గురువారం నుంచి వరుసగా ఐదు రోజుల పాటు అయ్యప్ప స్వామి శరణు ఘోష మార్మోగనుంది. ఈ నెల 18న ఇక్కడ అయ్యప్ప స్వామి ఆలయంతో పాటు దత్తాత్రేయ స్వామి, అభయాంజనేయ స్వామి, లక్ష్మీగణపతి, సాయిబాబా, నాగదేవత, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, మాలికాపురోత్తమ, మంజుల మాత, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠ చేయనున్నారు. ఆలయం కిందిభాగంలో ధ్యానమందిరం సైతం నిర్మిస్తున్నారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ తీర్థ స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 18న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 14న మండల కేంద్రంలో శోభాయాత్ర, 15న అఖండ నామస్మరణ, 16న యాగశాల ప్రవేశం, 17న సుదర్శన హోమం, మహా చండీ హోమం క్రతువులు చేయనున్నారు. 18న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సాయంత్రం అయ్యప్ప స్వామి పడి పూజ, పుష్పాభిషేకం నిర్వహిస్తారు. శ్రీ సాయి అ య్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ క్రతువు ను నిర్వహిస్తున్నారు. ఈ ఆలయానికి గ్రామానికి చెందిన పోల విఠల్‌రావు ఎకరం 9గుంటల భూమిని ఇచ్చారు. ఈ ట్రస్టుకు విఠల్‌రావు చైర్మన్‌గా, కార్యదర్శిగా నిషాంత్ చింతావర్, ఉపాధ్యక్షుడిగా జవ్వాజి సంతోష్, కోశాధికారిగా పోల అశ్విన్ వ్యవహరిస్తున్నారు.

గ్రూప్–3 పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్: పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. డీజీపీ జితేందర్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డితో కలిసి ఆమె బుధవారం సాయంత్రం కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గ్రూప్–3 పరీక్షల సన్నద్ధతతో పాటు ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి సర్వే తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. గ్రూప్–3 ఎగ్జామినేషన్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ మహేందర్ రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. అర గంట ముందే గేట్లు మూసి వేస్తారని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడిపించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణపై..

ధాన్యం సేకరణపై సీఎస్ సమీక్ష జరపగా జిల్లాలో ఈసారి 670కు పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆమెకు వివరించారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో సగటున 16 వేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరణ జరుగుతోందని అన్నారు. నిర్ణీత గడువులోపు రైతులకు బిల్లుల చెల్లింపులు జరిగేలా టాబ్ ఎంట్రీలను చేయిస్తున్నామని పేర్కొన్నారు. వరి కోతలు జరిపే సమయంలోనే ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను తప్పనిసరిగా వినియోగించేలా హార్వెస్టర్ల యజమానులకు సూచించాలని సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. కలెక్టర్లతో పాటు ఇతర జిల్లా అధికారులందరూ క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన మేర కంప్యూటర్ సిస్టంలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నవంబర్ 16 నుంచి డేటా ఎంట్రీ ప్రారంభించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్ర మోహన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, సీపీవో మల్లికార్జున్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, కిషన్, డీఎస్‌వో అరవింద్, సివిల్ సప్లైస్ డీఎం రాజేశ్వర్, డీసీవో శ్రీనివాస్, డీఏవో వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- ఎంపీ ధర్మపురి అర్వింద్



గన్నారంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఇందల్వాయి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడం, సన్నరకాలకు రూ.500 బోనస్‌పై విధివిధానాలు లేకపోవడం, అసంపూర్తిగా రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి పరస్పరం విమర్శలు చేసుకోవడం మాని నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ కేసుల విషయంలో కేటీఆర్ నుంచి కూడా నమూనాలు సేకరించాలన్నారు. రానున్న రోజుల్లో రైతులకు అన్యాయం జరగకుండా బీజేపీ ప్రభుత్వంతో పోరాడుతుందని అన్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, నాయిడి రాజన్న, తిరుపతి రెడ్డి, కేపీ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, కుంట మోహన్ రెడ్డి, కన్నె చిన్ను తదితరులు పాల్గొన్నారు.

పదిపై పట్టింపు కరువు!

- ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక
- అమలుకు నోచుకోని కార్యక్రమం
- డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకు పూర్తయింది 60 శాతమే..

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ విడుదల చేసిన ప్రత్యేక ప్రణాళిక అమలుకు నోచుకోవడం లేదు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కానీ దీని అమలులో మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రణాళిక ప్రకారం ముందుగా సిలబస్ పూర్తి చేసి, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి. కానీ ఈ ప్రక్రియ మాత్రం జిల్లాలో కొనసాగడం లేదు. జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 12,162 మంది, ప్రైవేట్ బడుల్లో 11,673 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు రూపొందించిన ప్రణళిక అమలు కావడం లేదు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ జనవరి వరకు పూర్తి చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ మాత్రం డిసెంబర్ వరకు సిలబస్‌ను పూర్తి చేయాలని నిర్దేశించింది. కానీ ఇప్పటివరకు కేవలం 60 శాతం మాత్రమే పూర్తి చేశారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియతో సిలబస్ పూర్తి చేయడంలో జాప్యం జరిగింది.



అమ్రాద్‌లో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు (ఫైల్)

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

పాఠశాలలో ఉత్తమ ఫలితాల కోసం జిల్లా విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ ప్రణాళిక ప్ర కారం ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్ ఏ ర్పాటు చేసుకోవాలి. తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహించాలి. జిల్లాలో ఇప్పటివరకు ఈ ప్రక్రియ ఎక్కడ కూడా కొనసాగలేదు. స్లిప్ టెస్టులు పెట్టి విద్యార్థుల నైపుణ్యాన్ని అంచన వేసి దానికి తగినట్లుగా పాఠాలు బోధించాలి. కానీ ఇది ఎక్కడా జరగడం లేదు. ప్రత్యేక తరగతులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదు. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు కొన్ని పాఠశాలల్లో హెచ్ఎంలు వివిధ సంఘాలకు చెందిన నాయకులు ఉన్నారు. వారు బడికి రాకపోవడంతో బోధన గాడి తప్పింది. సబ్జెక్టు టీచర్లు సైతం వివిధ సంఘాలకు చెందిన వారు ఉండటంతో డుమ్మాలు కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

26 నుంచి డిగ్రీ సెమిస్టర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ సీబీసీఎస్‌ బీఏ/ బీకాం/ బీఎస్సీ/ బీబీఏ/ బీసీఏ–1, 3, 5 వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 2, 4, 6వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌(2020 నుంచి 2023) బ్యాచ్‌ విద్యార్థులకు మాత్రమే ఈ షెడ్యూల్‌ వర్తిస్తుందన్నారు. ఈనెల 20 నుంచి నిర్వహించాల్సిన డిగ్రీ సెమిస్టర్‌ పరీక్షలను విద్యార్థుల కోరిక మేరకు 26 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిగ్రీ రీవాల్యుయేషన్‌ నోటిఫికేషన్‌ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ రీవాల్యుయేషన్‌ నోటిఫికేషన్‌ విడుదల చేశారు. డిగ్రీ సీబీసీఎస్‌ 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్‌(బ్యాక్‌ లాగ్‌), 1, 2, 3వ(ఓన్లీ బ్యాక్‌ లాగ్‌) జూలై, ఆగస్టు–2024 పరీక్షకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని కంట్రోలర్‌ ఎం అరుణ బుధవారం పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 రీవాల్యుయేషన్‌ ఫామ్‌కు రూ. 25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సాయికుమార్‌కు ఎంపీ పరామర్శ



నిజామాబాద్‌నాగారం: బాసర ట్రిపుల్‌ ఐటీలో విద్యార్థిని మృతి చెందడంతో నిరసన తెలిపి పోలీసులు లాఠీ చార్జీలో దెబ్బలు తిని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌ను ఎంపీ అర్వింద్‌, అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ బుధవారం పరామర్శించారు. సాయి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడు డాక్టర్‌ వెంకటరమణారెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంపీ అర్వింద్‌ మాట్లాడుతూ.. బాసర ట్రిపుల్‌ ఐటీలో ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర పూర్వఅధ్యక్షుడు రెంజర్ల నరేశ్‌, నాయకులు పిల్లి శ్రీకాంత్‌, రాకేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరం.. ఆధ్యాత్మిక హారం

- కార్తీక మాసంలో పుణ్యస్నానాలు
- నదులకు తరలివెలుతున్న భక్తులు



కందకుర్తి త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌: కార్తీక మాసం వచ్చిందంటే శివ నామస్మరణతో మారు మోగుతుంది. శైవ క్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతుంటాయి. ఉపవాస దీక్షలతో పరమశివుని ఆరాధిస్తారు. ఉదయం, సాయంత్రం దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగిస్తారు. గోదావరి నదిలో పుణ్య స్నానం ఆచరించడానికి ఆసక్తి చూపిస్తారు. గంగమ్మకు పూజలు చేస్తూ హారతులు ఇస్తారు. కార్తీక మాసంలో నది స్నానం చేస్తే ఎంతో పుణ్యమని పండితులు పేర్కొంటున్నారు. భారతదేశంలో నైరుతి రుతుపవనాల వల్ల భారీ వర్షాలు కురుస్తాయి. అంటే అశ్వయుజమాసం వరకు రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. దీంతో అప్పటి వరకు వరదతో పోటెత్తిన నదులన్నీ.. కార్తీక మాసం వచ్చే సరికి తమ ఉధృతిని తగ్గించుకుంటాయి. కార్తీక మాసం ఆధ్యాత్మిక మాసం. ఈ నెలలో చేసే నది స్నానానికి, దీపదానానికి, శివ కేశవుల పూజకు అత్యంత విశిష్ట స్థానం ఉంది. కార్తీక మాసంలో నెల రోజుల పాటు సూర్యోదయాని కంటే ముందే అంటే ఆకాశంలో నక్షత్రాలు ఉండగానే ప్రవహించే నీటిలో స్నానం చేస్తారు.

నది స్నానం ఔషధ గుణాలు

కార్తీక మాసంలో వరద తేటగా మారుతుంది. రాళ్లని, వృక్షాలను రాసుకుంటూ సాగే నదులు. ఆయా ఖనిజాలను, మూలికలను తమలో కలుపుకొని ప్రవహిస్తూ సాగిపోతూ ఉంటాయి. దీంతో నదీజలాలలో ఔషదీగుణాలు కూడా ఈ సమయంలో అధికంగా ఉంటాయి. కనుక ఈ నెలలో నదీ స్నానం ఆరోగ్యపరంగా మంచిదని పెద్దలు పేర్కొంటున్నారు.

జ్యోతిష్యశాస్త్ర ప్రకారం నీటి, మానవుల మనసుపై చంద్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. ఈ మాసంలో చంద్రుడు చాలా శక్తిమంతంగా ఉంటాడు. అందుకే ఈ కార్తీక మాసాన్ని 'కౌముది మాసం అని కూడా అంటారు. చంద్ర కిరణాలతో ఔషధులతో తడిచిన నదుల్లో ఉదయాన్నే స్నానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఓ నమ్మకం. నదులను దైవంగా భావించి పూజిస్తారు. దీపాలు నీటిలో విడిచి పెట్టి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.



కందకుర్తిలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆలయాల్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

18,19న వినియోగదారుల జాతీయ సమావేశాలు



మాట్లాడుతున్న చక్రపాణి, సుదర్శన్‌

సుభాష్‌నగర్‌: జిల్లా కేంద్రంలో వినియోగదారుల జాతీయ సమావేశాలను ఈ నెల 18, 19న నిర్వహించనున్నట్లు సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి చర్ల సుదర్శన్‌ పేర్కొన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నగరంలోని మహేశ్వరిభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 18న జాతీయ గవర్నింగ్‌ కౌన్సిల్‌ సమావేశం, 19న 'వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలులో వివిధ ప్రభుత్వ శాఖల ప్రాధాన్యత' అంశంపై జాతీయ సెమినార్‌ ఉంటుందన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులచే బంగారు ఆభరణాలపై హాల్‌ మార్కింగ్‌ యూనిక్‌ ఐడెంటిఫికేషన్‌ నంబర్‌, సరైన ఆహారం పొందే హక్కు, వంటనూనెలు, పాలపొడిలపై శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పెందోట అనిల్‌ కుమార్‌, వీఎస్‌ వర్మ, సందు ప్రవీణ్‌, మహదేవుని శ్రీనివాస్‌, గైని రత్నాకర్‌, లక్ష్మి, ప్రవళిక, బి హరిప్రియ, రాజుల రామనాధం, యాటకర్ల దినేశ్‌, మల్లెల సునీత, ఎస్‌ రమ్య ఉన్నారు.

జిల్లాకు విచ్చేసిన భూగర్భ గనులశాఖ సెక్రెటరీ



సురేంద్ర మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైన్స్‌ డీడీ, ఏడీ

సుభాష్‌నగర్‌: రాష్ట్ర ప్రభుత్వ భూగర్భ గనులశాఖ సెక్రెటరీ కె సురేంద్ర మోహన్‌ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మైన్స్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ మధుసూదన్‌ రెడ్డి, ఏడీ విజయ్‌కుమార్‌ రాథోడ్‌ బుధవారం ఆర్‌ అండ్‌బీ గెస్ట్‌ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారి వెంట భూగర్భగనుల శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కల్లు సీసాలో బల్లి.. ఒకరికి అస్వస్థత



కల్లు సీసాలో వచ్చిన బల్లి

రెంజల్‌: కల్లు సీసాలో బల్లి రావడంతో దాన్ని సేవించిన ఒకరు అస్వస్థతకు గురైన ఘటన రెంజల్‌ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కల్లుబట్టీలో స్థానికుడు ఒకరు కల్లు సీసా తీసుకుని అక్కడే సేవించాడు. అందులోని అడుగు భాగంలో బల్లి ఉన్నట్లు గుర్తించిన వెంటనే వాంతులు చేసుకున్నాడు. స్థానికులు కల్లు బట్టీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి కల్లు బట్టీని మూసే వరకు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. కల్లు తాగి అస్వస్థతకు గురైన వ్యక్తిని నిర్వాహకులు ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. మండలంలో కల్తీ కల్లు ఏరులై పారుతున్నా ఎక్సైజ్‌ పోలీసులు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమన్వయంతో మెరుగైన న్యాయసేవలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: బార్‌ అండ్‌ బెంచ్‌ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి బుధవారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. కోర్టుల ద్వారా సత్వర న్యాయాన్ని ఆశిస్తున్న న్యాయార్థుల ఆశలకు అనుగుణంగా కృషి చేద్దామని అన్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత ఎంతో ఉందని, దానిని కాలానికి, సమయానికి అనుగుణంగా మార్చుకుని సివిల్‌, క్రిమినల్‌ కేసులను పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత ఎక్కువగా కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తే కోర్టుల్లో విచారణ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వెలుసుబాటు లభిస్తుందని జిల్లా జడ్జి పేర్కొన్నారు. బార్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. న్యాయవాద సమాజం ఎల్లప్పుడు ప్రజలకు మెరుగైన, త్వరితగతిన న్యాయసేవలు అందించడానికి కృషి చేస్తుందని అన్నారు. జిల్లా ప్రజలకు జిల్లా న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని నిలబెడతామని, కోర్టుల్లో న్యాయమూర్తుల, సిబ్బంది కొరత ఉన్నా చాలా కోర్టు కేసులు అనుకున్న దానికంటే ఎక్కువగానే పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌ రెడ్డి తెలిపారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీకాంత్‌ బాబు, జూనియర్‌ సివిల్‌ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ్‌, హరికృష్ణ, హరి కుమార్‌, చైతన్య, బార్‌ ఉపాధ్యక్షుడు పెండెమ్‌ రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌ రావు, కార్యదర్శి సురేశ్‌, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు భద్రత కల్పించండి



సీఎస్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: వికారాబాద్‌ దాడి ఘటనకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసిన జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వికారాబాద్‌ జిల్లా దుద్యాల మండలం లకచర్ల గ్రామంలో కలెక్టర్‌తో సహా వివిధ కేడర్ల రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిపై రెవెన్యూ ఉద్యోగులతో పాటు యావత్‌ ఉద్యోగవర్గం అంతా భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. విధినిర్వహణలో ఉద్యోగులపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు. బాధ్యులైన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాస్‌రావు, వంగ రవీందర్‌ రెడ్డి, కె చంద్రమోహన్‌, కె గౌతమ్‌ కుమార్‌, సత్యనారాయణ, భవాని శంకర్‌, కె నిరంజన్‌, రమన్‌ రెడ్డి, పి సుధాకర్‌, రామకృష్ణరెడ్డి, భార్గవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ విజేత జిల్లా బాలికల జట్టు



బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌ నాగారం: రాష్ట్రస్థాయి బాలికల హాకీ టోర్నీ విజేతగా నిజామాబాద్‌ జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బాలికల హాకీ టోర్నీ ఫైనల్‌ మ్యాచ్‌లో 2–0 తేడాతో మహబూబ్‌నగర్‌ జట్టుపై జిల్లా జట్టు విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. బుధవారం ముగింపు కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌హందాన్‌ హాజరై మాట్లాడారు. క్రీడలు నిజామాబాద్‌ జిల్లాకు పుట్టినిల్లు అని, త్వరలోనే ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు జిల్లాకు స్టేడియాన్ని అన్ని హంగులతో నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన గడుగు గంగాధర్‌ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరిక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడల కార్యదర్శి నాగమణి, గ్లోబల్‌ పాఠశాల చైర్మన్‌ సంతోష్‌ కుమార్‌, పీడీలు రవికుమార్‌, కార్యనిర్వాహక కార్యదర్శి గోపిరెడ్డి, పేట సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌ రెడ్డి, శీను, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా చేపట్టాలి



సోమేశ్వర్‌లో సర్వేను పరిశీలిస్తున్న సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి

బాన్సువాడ రూరల్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, కులగణన సర్వేను ఎన్యుమరేటర్లు నిర్ణీత గడువులోపు చేపట్టాలని బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి అన్నారు. సోమేశ్వర్‌లో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సర్వే ప్రారంభించాలని, రోజు కనీసం 20 కుటుంబాలను సర్వే చేయాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి 765–డి విస్తరణ పనులు పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్‌ వరప్రసాద్‌ ఉన్నారు.

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి క్రైం: మండలంలోని చిన్నమల్లారెడ్డి సబ్‌ స్టేషన్‌ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని కాకతీయనగర్‌, హౌసింగ్‌బోర్డు, చిన్నమల్లారెడ్డి, నర్సన్నపల్లి, రాజంపేట సబ్‌ స్టేషన్‌ పరిధిలోని గ్రామాలకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఏడీఈ కిరణ్‌ చైతన్య బుధవారం తెలిపారు. స్థానిక వినియోగదారులు సహకరించాలన్నారు.

క్రైం కార్నర్‌

దుబాయిలో అమ్దాపూర్‌ వాసి మృతి



హరికృష్ణ (ఫైల్‌)

బోధన్‌రూరల్‌: దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోధన్‌ మండలం అమ్దాపూర్‌ గ్రామానికి చెందిన చింతకుంట హరికృష్ణ(38) మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన హరికృష్ణ బతుకు దెరువు నిమిత్తం గత నెల 24న దుబాయికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ప్రాంతంలో గత నెల 31న రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని కంపెనీ ప్రతినిధులు ఈ నెల 7న కుటుంబీకులకు సమాచారం అందించారు. దుబాయి నుంచి హరికృష్ణ మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కుటుం పెద్ద దిక్కు కోల్పోడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌లోని సంతోష్‌ ఫ్యామిలీ దాబా హోటల్‌ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందని, అతని ఒంటిపై నలుపు రంగు షర్ట్‌, బ్లూ కలర్‌ జీన్‌ ప్యాంట్‌ ఉందన్నారు. మృతదేహాన్ని ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659858 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

పిట్లం: మద్యానికి బానిసైన ఒకరు జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తి కాంతయ్య(59)ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

బాల్కొండ: మెండోరా మండలం కొడిచర్లలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నారాయణ బుధవారం తెలిపారు. రేషన్‌ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో 3క్వింటాళ్ల10 కిలోల బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ శ్రీనివాస్‌కు సమచారం అందించడంతో ఆయన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా రేషన్‌ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు..

రెంజల్‌/ రుద్రూర్‌: బోధన్‌ మండలం పెగడాపల్లి నుంచి మండలంలోని సాటాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక, మొరంను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. పోతంగల్‌ మండలం కల్లూర్‌ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్‌ మల్లయ్య బుధవారం పేర్కొన్నారు. కొడిచర్ల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని కోటగిరి పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్‌ అహ్మద్‌ మొహియొద్దీన్‌ విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ వీరయ్య బుధవారం పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి కౌన్సిలింగ్‌ నిర్వహించి వారిని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్‌ ముగ్గురికి రూ. 8 వేలు జరిమానా విధించగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

కేసు నమోదు

సిరికొండ: మండలంలోని చీమనపల్లి జీపీ పరిధిలోని చేనియా నాయక్‌ తండాలో భూమి విషయంలో ఘర్షణ పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌రామ్‌ బుధవారం తెలిపారు. తండాకు చెందిన అజ్మీర జీవన్‌, అజ్మీర బాలు భూమి విషయంలో గొడవపడి పరస్పరం దాడి చేసుకున్నారని తెలిపారు. ఇరువురి ఫిర్యాదు మేరకు అజ్మీర జీవన్‌, అజ్మీర వినోద్‌, అజ్మీరా బాలు, డప్పు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

టిప్పర్‌ ఢీకొని గొర్రెలు మృతి

బోధన్‌ రూరల్‌: మండలంలోని బండార్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న రాజన్న చౌరస్తా వద్ద బుధవారం ఇసుక టిప్పర్‌ ఢీకొని మూడు గొర్రెలు మృతి చెందాయి. మంజీర నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంతో ఆ మార్గం ఇసుక టిప్పర్లు నడుస్తున్నాయి. టిప్పర్లు అతివేగంగా వెళ్తూ గొర్రెలను ఢీకొనడంతో గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పేకాట స్థావరంపై దాడి

రామారెడ్డి: మండల కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై నరేశ్‌ బుధవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 2690 నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మోపాల్‌: మండలంలోని కంజర్‌ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 10వ జోనల్‌ స్థాయి క్రీడాపోటీలు మూడోరోజు పోటాపోటీగా కొనసాగాయి. అండర్‌–14, 17, 19లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, పరుగు పందెం, చెస్‌, క్యారం, ఇతర 11 రకాల క్రీడా పోటీలు ఉల్లాసంగా, ఆసక్తిగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కంజర్‌ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ విజయలలిత మాట్లాడుతూ.. గురువారం జోనల్‌ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థినులు ఎంతో ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొంటున్నారని, అందరి సహకారంతో పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పీడీ ఉదయశీల, పీఈటీ లత, ఎస్‌వీపీ వినోద, జేవీపీ సునీత, పీఈడీలు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

లంచం తీసుకున్న ఏఈకి రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి(నిజామాబాద్‌ అర్బన్‌): లంచం తీసుకున్న ఓ ఏఈకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్‌ అఫ్రోజ్‌ అక్తర్‌ బుధవారం తీర్పు ఇచ్చారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌ గౌడ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నిజామాబాద్‌ నగరంలోని బొబ్బిలివీధికి చెందిన కాంట్రాక్టర్‌ బండారి అరవింద్‌.. పుష్కర కాలం క్రితం నగరంలోని సంజయ్‌ పార్క్‌ నుంచి విజ్ఞాన్‌ పాఠశాల వరకు రోడ్డు పనులు చేశారు. కొలతలను నమోదు చేయడానికి ఏఈ పోరెడ్డి అశోక్‌ రూ. 40 వేలు లంచం డిమాండ్‌ చేశారు. దీంతో కాంట్రాక్టర్‌ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు వలపన్ని 2012 మే 29న రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏఈని పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ తరపున నాంపల్లి స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఏఎల్‌ మనోజ్ఞ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్‌ అఫ్రోజ్‌ అక్తర్‌ బుధవారం తీర్పు ఇచ్చారు. లంచం తీసుకున్న ఏఈ పోరెడ్డి అశోక్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 40 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో నెల రోజులు అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు మంగళం

- శాఖ గ్రంథాలయాల్లో వారోత్సవాలకు నిధులు లేకపోవడంతో..
- మరోసారి వారోత్సవాల నిర్వహణ రద్దు



మోర్తాడ్‌లోని గ్రంథాలయ భవనం

మోర్తాడ్‌: గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించడానికి నిర్దేశించిన గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు నిధుల కొరతతో బ్రేక్‌ పడింది. ప్రతి ఏడాది నవంబర్‌ 14 నుంచి వారం రోజుల పాటు గ్రంథాలయ వారోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించేవారు.కొన్నేళ్ల నుంచి నిధుల కొరతతో పాటు వివిధ కారణాలతో గ్రంథాలయ వారోత్సవాలకు మంగళం పలికారు.జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కేవలం జిల్లా కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.శాఖ గ్రంథాలయాల్లో వారోత్సవాల నిర్వహణ రద్దు కావడంతో పుస్తక ప్రియులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ మండల కేంద్రాలు, మేజర్‌ పంచాయతీలలో 24 గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పాఠల పోటీలు, రంగవళ్లులు, చిత్రలేఖనం, పుస్తక పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసేవారు. ఒక్కో శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల నిర్వహణకు కనీసం రూ.5వేల వరకు నిధులు అవసరం అవుతాయి.

2018 నుంచి నిలిచిన నిర్వహణ

గ్రంథాలయ వారోత్సవాలను 2018 వరకు ప్రతి ఏడాది ఎంతో సంబరంగా నిర్వహించారు. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ కారణంగా వారోత్సవాలను రద్దు చేశారు. 2019లో నిధుల కొరతతో, 2020లో కరోనా, 2021లో ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వారోత్సవాల నిర్వహణ సాగలేదు. 2018లో వారోత్సవాలకు పట్టిన గ్రహణం ఇప్పటికి వీడటం లేదు. ఏదో ఒక కారణంతో శాఖ గ్రంథాలయాల్లో వారోత్సవాల నిర్వహణ నిలిచిపోతూనే ఉంది. తాజాగా నిధుల లేమి కారణంగా జిల్లా కేంద్రానికే వారోత్సవాలను పరిమితం చేశారు.

జిల్లా కేంద్రంలోనే నిర్వహిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయంలోనే వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. గతంలో ఎన్నికలు, కరోనా తదితర కారణాలతో వారోత్సవాలు రదయ్యాయి.ఇప్పుడు నిధులు లేకపోవడంతో వారోత్సవాలను జరపడం లేదు.

– బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి